సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం । 30 । సెప్టెంబర్ । 2025



సామాన్యుడిపై టీడీపీ నాయకుల దౌర్జన్యం

రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జగన్మోహన్‌రాజు బంధువుల స్థల వివాదం.. నరసింహరాజుపై దౌర్జన్యం చేసేలా జరిగింది. - 8లో



కౌన్సిలర్లను గౌరవించాల్సిందే

ప్రజలు గెలిపించిన కౌన్సిలర్లకు వారి వార్డుల్లో గౌరవం ఉండేలా.. అలాగే వారి అమోదంతోనే పనులను ప్రతిపాదించాలని మున్సిపల్ చైర్మన్ వరపన మనూజ స్పష్టం చేశారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.130	రూ.160
రెండోరకం	రూ.90	రూ.120

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 259 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

బాధితులకు న్యాయం చేయాలి



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటి : ఫిర్యాదులపై అలసత్వం లేకుండా బాధితులకు న్యాయం అందించాలని అధికారులకు జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని ఎస్పీ పర్యవేక్షించారు. ప్రతి ఫిర్యాదుదారుడితో ముఖాముఖి మాట్లాడి సమస్యల మూలాలను తెలుసుకున్నారు. జిల్లా కేంద్రానికి రాలేని అర్జీదారులు సమీప పోలీస్‌స్టేషన్, సర్కిల్ లేదా సబ్ డివిజన్ కార్యాలయంలో అర్జీలు సమర్పించవచ్చని తెలిపారు. పోలీసు అధికారులతో ఫోన్లో స్వయంగా మాట్లాడి, కీలక సూచనలు చేశారు. ప్రజాసేవలో పోలీసులు నిరంతరం ముందుంటారని, ప్రజలు ధైర్యంగా తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఎస్పీ పేర్కొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



నిత్యపూజస్వామి హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

సిద్దవటం : శ్రీ నిత్యపూజ స్వామి హుండీ ఆదాయం లెక్కించగా రూ.60,785 ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ రాజంపేట ఇన్‌స్పెక్టర్ జనార్దన్, ఆలయ కార్యనిర్వహణాధికారి ఏ.శ్రీధర్‌లు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఆగస్టు 13 నుంచి సెప్టెంబర్ 29వ తేదీ వరకు భక్తులు స్వామి వారి హుండీలో వేసిన కానుకలను గ్రామస్తుల సమక్షంలో లెక్కించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది చంద్ర, వంతాటిపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ దరఖాస్తు గడువు పెంపు

మదనపల్లె సిటీ : ఓపెన్ స్కూల్ ద్వారా పదోతరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశానికి గడువును అక్టోబర్ 31వతేదీ వరకు పెంచినట్లు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ పఠాన్ మహమ్మద్‌ఖాన్ తెలిపారు. రూ.200 అపరాధ రుసుంతో అవకాశం కల్పించారన్నారు. 14 సంవత్సరాలు వయస్సు నిండిన వారు పదోతరగతిలో, అలాగే 10వ తరగతి పూర్తి చేసిన వారు ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందొచ్చన్నారు. ఓపెన్ స్కూల్ దారా ప్రవేశం పొందినవారు సెలవు దినాల్లో నిర్వహించే తరగతులకు హాజరుకావాలన్నారు. అడ్మిషన్ పొందిన వెంటనే అభ్యర్థులు పెట్టిన చిరునామాకు పాఠ్యపుస్తకాలు పంపబడుతాయన్నారు. పూర్తి వివరాలకు 8121852786 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పల్లె వైద్యం పడక

- సమస్యల పరిష్కారం కోరుతూ డాక్టర్ల సమ్మె
- విధులకు హాజరైనా..నాడి పట్టని వైద్యులు
- పీహెచ్‌సీలలో ఎక్కడికక్కడ ఆగిపోయిన సేవలు



ఓబులవారిపల్లె : వైద్య సేవలు లేకపోవడంతో నిర్మానుష్యంగా మండలకేంద్రంలోని ఆరోగ్య కేంద్రం

సాక్షి రాయచోటి/సాక్షి నెట్‌వర్క్ : రోగి నాడి పట్టి వైద్యం అందించే వైద్యులకు కష్టకాలం వచ్చింది. ప్రజల కోసం అనుక్షణం గ్రామీణ ప్రాంత ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు తమ సమస్యల పరిష్కారం కోసం నిరసనగళం వినిపిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా వైద్య సేవలు అందిస్తున్నా తమ డిమాండ్లు నెరవేర్చడంలో కూటమి సర్కార్ చూపుతున్న నిర్లక్ష్య వైఖరిపై ప్రత్యక్ష యుద్ధానికి సిద్ధమయ్యారు. పట్టణాల్లో కాకుండా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి రోగుల బాగోగులను చూస్తున్నా...తమకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించకపోవడంపై వైద్యులు ఆందోళన బాట పట్టారు. ఇందులో భాగంగా దశల వారీ ఉద్యమానికి కార్యచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారు. ఇప్పటికే వాట్సాప్ గ్రూపు బహిష్కరణ చేపట్టిన వైద్యులు సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు హాజరైనా వైద్యం అందించలేదు. మరికొంత మంది సమ్మె నేపథ్యంలో ఆస్పత్రుల వైపు కన్నెత్తి కూడా చూడలేదు.

ఆస్పత్రులకు భారీగా రోగులు

జిల్లాలోని 30 మండలాల్లో సుమారు 50 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు, చలి పెరిగిన నేపథ్యంలో వ్యాధులు విస్తరిస్తున్నాయి. శ్వాస కోశ వ్యాధులతో పాటు చలి జ్వరం, జలుబు, అస్తమా, దగ్గు ఇలా వివిధ అనారోగ్య సమస్యలతో గ్రామీణ ప్రాంతాల నుంచి సోమవారం ఉదయాన్నే రోగులు ఆస్పత్రులకు పరుగులు పెట్టారు. జిల్లాలోని సాక్షి ప్రతినిధులు పలు ఆస్పత్రులను విజిట్ చేశారు. ఈ సందర్భంలో పలుచోట్ల రోగులు కనిపించారు. అయితే అత్యవసర సేవలు మినహా సాధారణ రోగాలను పట్టించుకోకపోవడంతో అక్కడున్న సిబ్బంది ద్వారా తాత్కాలికంగా మందులు తీసుకుని ఇంటి ముఖం పట్టారు.

అత్యవసర సేవలు మినహా..

జిల్లాలోని 50 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించి కొన్నిచోట్ల పీహెచ్‌సీలకు వైద్యులు వచ్చారు. మరికొన్నిచోట్ల రాలేదు. అయితే ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో సాధారణ రోగులను సమ్మె నేపథ్యంలో వైద్యులు పట్టించుకోలేదు. అత్యవసర సేవలకు మాత్రమే పరిమితమయ్యారు. 104 సేవలను కూడా పూర్తిగా నిలిపివేశారు. వాట్సాప్, ప్రభుత్వ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. తమ ఆందోళనలో భాగంగా సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు హాజరైనా అత్యవసర సేవకులకు మాత్రమే పరిమితమయ్యారు. మంగళవారం నుంచి అక్టోబరు 2 వరకు జిల్లా కేంద్రాల్లో నిరసనలకు సిద్ధమయ్యారు. ప్రధానంగా ఇన్ సర్వీసు కోటాను పునరుద్ధరించాలని, టైమ్ బౌండ్ ప్రమోషన్ల అమలు, గిరిజన ప్రాంతాల్లో పనిచేసేవారికి బేసిక్ పే 50 శాతం ట్రిబల్ అలవెన్స్‌ల మంజూరుకు డిమాండ్‌చేస్తున్నారు. అలాగే నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, చంద్రన్న సంచార చికిత్స ప్రోగాం కింద వైద్యులకు రూ. 5 వేల అలవెన్స్, వైద్యులకు జాబ్‌చార్ట్, కచ్చితమైనపనిగంటలు, స్థిరమైన వారాంతపు సెలవు ఇవ్వాలని...నేటివిటీ-అర్బన్‌ఎలిజిబులిటీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ ఆందోళన బాటపట్టారు.



- లక్కిరెడ్డిపల్లె మండలంలోని దేవళంపల్లె పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో అక్కడ పనిచేసే కంటింజెంట్ వర్కరే రోగులకు వైద్యం అందజేస్తున్నారు. పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదని రోగులు వాపోతున్నారు.



సిద్ధవటం : మాధవరం పీహెచ్‌సీలో వైద్యం కోసం వేచి ఉన్న రోగులు



సుండుపల్లె : వైద్యశాలలో డాక్టర్లు లేకపోవడంతో వేచి ఉన్న రోగులు

వేచి ఉండాల్సి వచ్చింది



మలేరియా జ్వరం సోకింది. రెండు రోజులుగా మాధవరం ప్రభుత్వాసుపత్రిలో వైద్యం చేయించుకున్నాను. అయినా తగ్గలేదు. నీరసంగా ఉండటంతో డాక్టర్ దగ్గర చూపించుకొని సెలైన్ ఎక్కించుకుందామని వస్తే ఇక్కడి డాక్టర్లు సమ్మె చేస్తున్నారని తెలిసింది. సుమారు అరగంట పాటు ఆసుపత్రిలోనే వేచి ఉన్నాను. చివరకు ఏఎన్ఎం వచ్చి సెలైన్ ఎక్కించారు.

– గంజి.రామలక్ష్మమ్మ, మాధవరం–1, సిద్ధవటం మండలం

పట్టించుకునే వారు లేరు



మా కుటుంబంలో ముగ్గురం రెండురోజులుగా జ్వరాలతో బాధపడుతున్నాం. చికిత్స పొందేందుకు రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాం.అక్కడ పట్టించుకునే వారు లేరు. దీంతో దేవళంపల్లెకు వచ్చాం. ఇక్కడ సిబ్బంది సూదులు వేస్తున్నారు.ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లే పరిస్థితి లేక ఇక్కడివస్తే వైద్యులు అందుబాటులో లేరు. ఉన్నతాధికారులు స్పందించాలి.రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– పార్వతి, మూలపల్లె,కూర్నూతల గ్రామం, లక్కిరెడ్డిపల్లె మండలం

అర్జీలకు సత్వర పరిష్కారం

– జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి : పీజీఆర్ఎస్ అర్జీలకు సత్వరం పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తుందని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జేసీ ఆదర్శరాజేంద్రన్, డీఆర్‌ఓ మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటిలకు నియామక పత్రాలు

జిల్లా వెనుక బడిన తరగగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ పొంది, డీఎస్సీ ద్వారా స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీలకు నియామక పత్రాలు పొందిన వారిని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సోమవారం అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా నియామకం కావడం వారి కష్టానికి ఫలితమన్నారు. విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని వారికి కలెక్టర్ సూచించారు. స్కూల్ అసిస్టెంట్‌గా నియామకమైన ఎస్ మహమ్మద్, ఎస్జీటీగా నియామకమైన శివాజీలకు మెగా డీఎస్సీ నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన సంక్షేమశాఖ అధికారి సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్



మదనపల్లె సిటీ : సరస్వతిదేవి అలంకారంలో వాసవీకన్యకా పరమేశ్వరి

• వీణాపుస్తకధారిణి..వందే అక్షరరూపిణి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతున్నాయి. జిల్లావ్యాప్తంగా అమ్మవారి ఆలయాలన్నీ భక్తులతో పోటెత్తుతున్నాయి.సోమవారం జగన్మాత వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. చాలాచోట్ల సరస్వతీ దేవిగా కటాక్షించారు. భక్తులు పెద్దఎత్తున ఆలయానకు చేరుకుని కనులారా దర్శించుకున్నారు. వీణాపాణి..విద్యాప్రదాయిని తమలో జ్ఞానజ్యోతులు వెలిగించాలని వేడుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



రాజంపేట టౌన్ : వాసవీమాతను ఊరేగిస్తున్న భక్తులు



రాయచోటిటౌన్ : సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న శ్రీ కన్యకాపరమేశ్వరీ

న్యాయం గెలిచింది

- ఎంపీ మిథున్‌కు బెయిల్‌పై సంబరాలు
- కూటమి అక్రమ అరెస్టులకు భయపడమంటూ నినాదాలు



మదనపల్లె : పార్టీ కార్యాలయం వద్ద నిసార్, పార్టీ శ్రేణుల సంబరాలు

మదనపల్లె : రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిని జూలై 19న కూటమి ప్రభుత్వం మద్యం అక్రమ కేసులో అరెస్టు చేసింది. 72 రోజులపాటు నిర్బంధించింది. బెయిల్ రాకుండా కుట్రలు, కుతంత్రాలు చేసింది. బెయిల్ కోసం న్యాయస్థానం ముందు పిటిషన్ వేస్తే.. అడ్డుకునేందుకు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సిట్ పిటిషన్ వేసింది. అరెస్ట్ అయిన 62 రోజుల తర్వాత సిట్ కస్టడి కోరడం, దాని వెనక ఉద్దేశం ఇట్టే అర్థమవుతుంది. అక్రమ అరెస్ట్ నుంచి.. ఎన్నో వేధింపులు, ఇబ్బందులకు గురి చేసినా చివరకు న్యాయమే గెలిచింది.

సోమవారం విజయవాడ ఏసీబీ కోర్టు మిథున్ రెడ్డికి బెయిల్ మంజూరు చేసింది. దీంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది. తమ నేతను అక్రమ కేసులో నిర్బంధించి, వేధించారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బెయిల్ మంజూరు వార్త బయటకు రాగానే జిల్లాలోని పలు ప్రాంతాల్లో పెద్దిరెడ్డి కుటుంబ అభిమానులు, అనుచరులు, వైఎస్సార్‌సీపీప నేతలు, కార్యకర్తలు ఆనందోత్సాహలతో సంబరాలు జరుపుకున్నారు. టపాకాయలు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. మిథున్ రెడ్డి బ్యానర్లు చేతబట్టి.. జై జగన్, జై మిథున్ రెడ్డి అంటూ నినాదాలు చేశారు. అక్రమ అరెస్టులకు భయపడే ప్రసక్తి లేదన్నారు. కూటమి ప్రభుత్వానికి, కక్షగట్టి వేధిస్తున్న చంద్రబాబుకు అధికార పతనం తప్పదు అంటూ హెచ్చరించారు.

అంతిమ విజయం న్యాయానిదే



రాజకీయంగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని ఎదుర్కోలేక కుట్రపూరితంగా కూటమి సర్కార్ అక్రమ మద్యం కేసు పెట్టింది. మిథున్‌కు బెయిల్ మంజూరు కావడం మంచి పరిణామం. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై పెడుతున్న అక్రమ కేసులు ఎన్నో రోజులు నిలవవు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలన్నీ ప్రజలు గమనిస్తూ ఉన్నారు. తగిన సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు బుద్ధిచెబుతారు. ఎవరెన్ని తప్పుడు కేసులు పెట్టినా అంతిమ విజయం న్యాయానిదే.

– గడికోట శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

కోర్టు తీర్పు కూటమి సర్కార్‌కు చెంపపెట్టు



గత ఎన్నికల సమయంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కుటుంబాన్ని ఎదుర్కోలేక కూటమి సర్కార్ మద్యం అక్రమ కేసు పెట్టింది. ఈ కేసులో మిథున్ రెడ్డికి బెయిల్ మంజూరు కావడం చాలా సంతోషంగా ఉంది. ఏసీబీ కోర్టు తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిది. ఇలాంటి తప్పుడు కేసులకు భయపడే ప్రసక్తి లేదు. ఇప్పటికైనా కూటమి పాలకులు బుద్ధి తెచ్చుకుని ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడాలి.

– ఆర్ రమేష్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

సాక్ష్యాలు లేని కేసు



ఎంపీ మిథున్ రెడ్డి పై పెట్టిన మద్యం అక్రమ కేసు ముమ్మాటికీ తప్పుడు కేసే.సాక్ష్యాలు లేకుండా అరెస్ట్ చేశారని మిథున్ రెడ్డి చెప్పడం అక్షరాలా నిజమైంది. వైఎస్సార్‌సీపీని బలహీనపర్చాలన్న టీడీపీ కుట్రలు సాగవు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి చావుదెబ్బ తప్పదు.

– నిసార్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ, మదనపల్లె సమన్వయకర్త

కేసులో పసలేదు



అక్రమ మద్యం కేసులో పసలేదు. ఎంపీగా మిథున్ రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాల్లో ప్రమేయం ఉండదు. మద్యం వ్యవహారంలో ఆయన పాత్ర లేదు. నిరూపించేందుకు కనీస ఆధారాలు కూడా లేవు. అయినప్పటికీ వేధించాలన్న లక్ష్యంతో అక్రమ కేసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. న్యాయస్థానం బెయిల్ ఇవ్వడం ద్వారా తప్పుడు కేసు అని నిరూపితమైంది.

– దేశాయి తిప్పారెడ్డి, మదనపల్లె మాజీ ఎమ్మెల్యే

మెడికల్ విద్య ప్రైవేట్ పరం వద్దంటూ నేడు నిరసన

రాయచోటి : మెడికల్ కళాశాల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయడాన్ని నిరసిస్తూ దళిత విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర దళిత విభాగాల పిలుపుమేరకు రాయచోటిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరగుతుందని, దీనిని జయప్రదం చేయాలని పార్టీ దళిత సంఘాల నేతలు సోమవారం పేర్కొశు. కార్యక్రమంలో దళిత ప్రజాప్రతినిధులు,విద్యార్థి విభాగం నాయకులు, దళిత సంఘాల నేతలు పాల్గొంటారని తెలియజేశారు. నిరసన అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పిస్తామని పేర్కొన్నారు.

వైభవం.. బిందెసేవ గ్రామోత్సవం

రాజంపేట టౌన్ : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గ్రంధే సత్యనారాయణగుప్త ఆధ్వర్యంలో నిర్వహించిన బిందెసేవ గ్రామోత్సవ సంబరం అంబరమంటింది. అమ్మవారిశాల మాడవీధులతో పాటు పట్టణంలోని మెయిన్‌రోడ్డు, పురవీధుల్లో గ్రామోత్సవం సాగింది. ఈసందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భక్తి, జానపద గేయాలకు కళాకారులు ప్రదర్శించిన కోలాటం ప్రజలను అబ్బురపరిచింది. దారివెంబడి గుర్రం చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. అమ్మవారి బిందెసేవలో రాజంపేట పట్టణ వాసులే కాక వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు వాహనాలను దారి మళ్లించారు. గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.



వాసవీమాత ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు



కోలాటం వేస్తున్న కళాకారులు

క్లుప్తంగా

ఆటో బోల్తా.. యువకుడి మృతి


కృష్ణభగవాన్ (ఫైల్)

మదనపల్లె రూరల్ : ఆటో బోల్తా పడి యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. పట్టణంలోని వాల్మీకి వీధికి చెందిన నరసయ్య, రెడ్డెమ్మ దంపతుల రెండో కుమారుడు కృష్ణభగవాన్ (27) టైల్స్ పనులు చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉండే వాడు. ఆయన స్నేహితులైన బాబు, విజయ్‌తో కలిసి ఆటోలో బైపాస్‌రోడ్డు మీదుగా పట్టణంలోకి వస్తుండగా, అరేబియా హోటల్ సమీపంలో వేగాన్ని అదుపుచేయలేక ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కృష్ణభగవాన్ తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్సలు అందిస్తుండగా, పరిస్థితి విషమించి మృతి చెందాడు. దీంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. సమాచారం అందుకున్న తాలూకా పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ వెంకటరమణ తెలిపారు.

10 నుంచి క్యారమ్స్ పోటీలు

నందలూరు : నందలూరు రైల్వే కేంద్రంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో యంగ్ మెన్స్ క్యారమ్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో సౌత్ ఇండియా లెవెల్ క్యారమ్స్ పోటీలు అక్టోబర్ 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ నాయకులు తెలిపారు. స్థానికంగా వారు సోమవారం వివరాలు వెల్లడించారు. పోటీలో పాల్గొనదలచినవారు అక్టోబర్ 5వ తేదీ లోపల డబుల్స్ రూ.500, సింగిల్స్ రూ.300 చెల్లించి తమ ఎంట్రీలు పంపాలని తెలిపారు. క్యారమ్స్ పోటీలు (స్ట్రైట్ గేమ్)లో ఉంటాయని తెలియజేశారు. ఎంట్రీలను బిఎస్ శంకర్ ప్రెసిడెంట్, యంగ్ మెన్స్ క్యారమ్స్ అసోసియేషన్, నందలూరు అన్నమయ్య జిల్లా వారికి పంపాలని తెలిపారు. ఎంట్రీల కోసం 7732054403, 9908095211, 9866015602, 7989392971 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. ఈ పోటీలలో డబుల్స్ విన్నర్స్‌కు రూ.40 వేలు, రన్నర్స్‌కు రూ.25 వేలు, సింగిల్స్ విన్నర్స్‌కు రూ.25 వేలు, రన్నర్స్‌కు రూ.15 వేలతోపాటు మరిన్ని బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు పైన తెలిపిన ఫోన్ నంబర్లకు సంప్రదించాలని వివరించారు.

కరెంట్ షాక్‌తో పశ్చిమబెంగాల్ వాసి మృతి


మృతి చెందిన సంజయ్ బాగ్దీ

లక్కిరెడ్డిపల్లె : విద్యుత్ లైన్‌లకు మరమ్మతులు చేస్తుండగా కరెంట్ షాక్‌కు గురై పశ్చిమబెంగాల్‌కు చెందిన పూర్వబర్ధమాన్ జిల్లా రామగోపాల్‌పూర్‌కు చెందిన సంజయ్ బాగ్దీ (32) అనే యువకుడు మృత్యువాత పడినట్లు స్థానికులు తెలిపారు. మండలంలోని కాకుళవరం గ్రామం ఎస్సీ కాలనీలో ఒక లైన్‌మెన్‌కు సహాయకుడిగా ఆర్డీఎస్ఎస్ కింద పని చేస్తున్న సంజయ్ బాగ్దీ ఆదివారం రాత్రి కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి సోమవారం మృతుడి బంధువులకు అప్పగించినట్లు సమాచారం. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అభివృద్ధి పనుల్లో కౌన్సిలర్లను గౌరవించాల్సిందే

- లేదంటే అజెండా అంశాలను నిక్కచ్చిగా తిరస్కరిస్తాం
- అధికారులను హెచ్చరించిన ఛైర్మన్ మనూజ
- సమస్యలపై కౌన్సిలర్ల ఏకరువు
- ఆపై అజెండాపై చర్చ, ఆమోదం తెలపకుండా కౌన్సిల్ వాకౌట్


కౌన్సిల్ సమావేశం నుంచి వాకౌట్ చేస్తున్న కౌన్సిలర్లు

మదనపల్లె : ప్రజలు గెలిపించిన కౌన్సిలర్లకు వారి వార్డుల్లో గౌరవం ఉండేలా.. ఆయా ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారంలో కౌన్సిలర్లకు తప్పనిసరిగా గౌర్వం ఇవ్వాలని, ఆలాగే వారి అమోదంతోనే పనులను ప్రతిపాదించాలని మున్సిపల్ ఛైర్మన్ వరపన మనూజ స్పష్టం చేశారు. సోమవారం ఆమె అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలు, తాము ప్రతిపాదించని పనులను అజెండాలో ఉన్నట్లు ఆరోపించారు. దీనిపై తీవ్రంగా స్పందించిన ఛైర్మన్ అధికారులపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. వార్డుల్లో ఏ పని చేయాలన్నా కౌన్సిలర్ల అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. ఇలా జరగని పక్షంలో కౌన్సిల్ అజెండాలో పెట్టే పనులను తిరస్కరిస్తామని హెచ్చరించారు. వైస్‌ఛైర్మన్ జింకా చలపతి మాట్లాడుతూ కౌన్సిల్ పదవీకాలం ఉన్నంత వరకైనా కౌన్సిలర్లను గౌరవించండని కోరారు. తమ వార్డులో వీధిలైట్లు వెలగడం లేదని, ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు చర్యలు తీసుకోకుండా ఏం చేస్తున్నారని నిలదీశారు. దీనిపై సమాధానం చెప్పాలన్నారు. కౌన్సిలర్లు బీఏ.ఖాజా, శ్రీనివాసులు, ప్రసాద్, రాజేష్ మాట్లాడుతూ కౌన్సిలర్లకు విలువ లేకుండా పోతోందని, కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి తప్పితే కూటమి పాలనలో ఒక్క పని జరగలేదన్నారు. అభివృద్ధి పనుల పేరిట చెపడుతున్న పనులకు బిల్లులు ఇవ్వకుండా పనులు పెట్టడం ఎందుకు, వాటిని రద్దు చేయండని నిలదీశారు. ఆర్అండ్‌బీ రహదారిలో సిమెంటు రోడ్డును వేయిస్తున్న అధికారులు చిత్తూరుబస్టాండ్‌లోని గుంతలపై మానవత్వంలో స్పందించి పనులు చేయించాలని కోరారు. కౌన్సిలర్లు ఉండగా టీడీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు చెప్పే పనులకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వడం అన్యాయమన్నారు. దీనితో కౌన్సిలర్లకు విలువలేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి రావడంతోనే పారిశుధ్యం అధ్వానంగా మారిందని మండిపడ్డారు. కౌన్సిలర్ కరీముల్లా మాట్లాడుతూ మున్సిపాలిటీకి పన్నుల రూపంలో ఎంత ఆదాయం వస్తోందని, అన్నివార్డులకు సమంగా అభివృద్ధి పనులు చేస్తున్నారా అని ప్రశ్నించారు. మౌలిక వసతుల కల్పనలో అధికారులు విఫలం అవుతున్నారని ఆరోపించగా.. ఆదాయం, పనులకు సంబంధించి కమిషనర్ ప్రమీల వివరణ ఇచ్చారు. కౌన్సిలర్ షబానా మాట్లాడుతూ పట్టణంలోని చిత్తూరుబస్టాండ్, ఫైర్‌స్టేషన్, మిషన్‌కాంపౌండ్ వద్ద పెట్టుకున్న దుకాణాలకు అనుమతి ఎవరు ఇచ్చారు, వారి నుంచి అద్దెలను ఎవరు వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని కమిషనర్ ప్రమీల చెప్పారు. టీడీపీ కౌన్సిలర్ తులసీ మాట్లాడుతూ అభివృద్ధి పనులు అజెండా పెడుతున్నారే కానీ కౌన్సిల్ వాటి పనులు చేపట్టడం లేదని, అభివృద్ధి కుంటుపడిందని విమర్శించడంతో వైస్‌ఛైర్మన్ జింకా చలపతి, కౌన్సిలర్ రాజేష్ మాట్లాడుతూ కూటమిపాలన రాకతోనే అభివృద్ధికుంటుపడిందని, ఈ విషయమై ఎమ్మెల్యేను ప్రశ్నించాలని కోరారు. తర్వాత కరీముల్లా, తులసీలు సమావేశం నుంచి వెళ్లిపోయారు.

అజెండా వద్దంటూ కౌన్సిల్ వాకౌట్

కౌన్సిల్ సమావేశంలో చర్చించి ఆమోదం తెలపాల్సిన అంశాలపై అధికారులు అజెండాను రూపొందించారు. 30 అంశాలపై ఆమోదం తెలపాల్సి ఉండగా దానిపై కనీస చర్చ లేకుండా కౌన్సిల్ మొత్తం నిరసన వ్యక్తం చేస్తూ వాకౌట్ చేసింది. దీనితో అజెండాను పట్టించుకోకుండా అర్థాంతరంగా కౌన్సిల్ సమావేశాన్ని ముగించారు. దీనిపై ఛైర్మన్ మనూజ మాట్లాడుతూ కౌన్సిలర్ల అభిప్రాయాలు తీసుకోకుండా, వారిని నిర్లక్ష్యం చేసి అజెండా అంశాలను ప్రతిపాదించిన కారణంగా వాటిపై చర్చలేకుండా తిరస్కరించామని చెప్పారు. దీని కారణంగానే సమావేశాన్ని అర్థాంతరంగా ముగించామని చెప్పారు. ఈ సమావేశంలో మేనేజర్ పీఆర్.మనోహర్, డీఈ శ్రావణీ, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వెంకటసుబ్బయ్య, ఏఈ రవీంద్రనాయక్, ఆర్ఐలు శ్రీనివాసులు, తిరుమల, సిబ్బంది పాల్గొన్నారు.

మెట్లపై నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

మదనపల్లె రూరల్ : గుడి మెట్లపై నుంచి జారి పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. స్థానికుడైన అంజన్న కుమారుడు రమేష్ (35) పూటుగా మద్యం సేవించి గంగమ్మ గుడి వద్దకు వెళ్లాడు. అక్కడ నుంచి మెట్లు దిగే క్రమంలో జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

జనసంఘం నాయకుడిపై కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం : ప్రభుత్వాధికారి విధులకు ఆటంకం కలిగించడంతోపాటు బెదిరించినందుకు గాను జనసంఘం నాయకుడు పెద్దిరాజుపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమైంది. ప్రొద్దుటూరు మండలంలోని కొత్తపల్లె కాల్వపై అక్రమ కట్టడాలను నిర్మించారని, వాటిపై చర్యలు తీసుకోవాలని జనసంఘం నాయకుడు పెద్దిరాజు కొన్ని రోజుల క్రితం కలెక్టర్‌కు అర్జీ పెట్టాడు. ఈ క్రమంలో ఈఓఆర్డీ, కొత్తపల్లె పంచాయతీ ఇన్‌చార్జి సెక్రటరి రామాంజనేయరెడ్డిని పెద్దిరాజు తన పిటిషన్‌పై చర్యలు తీసుకోకుండా.. ఎందుకు క్లోజ్ చేశావంటూ కాలర్ పట్టుకొని బెదిరించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో మల్లికార్జునస్వామి


ఏనుగుమల్లమ్మ

తంబళ్లపల్లె : మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. దేవీశరన్నవరాత్రుల సందర్భంగా స్వామి, అమ్మవారికి పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున ప్రత్యేక అలంకరణ చేశారు. పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. మహాశివరాత్రిని తలపించే విధంగా సుదూరప్రాంతాలు కర్ణాటక, సత్యసాయి, అనంతపురం, వైఎస్సార్ కడప జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు మల్లయ్యకొండను సందర్శించి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ మునిరాజ, కొండకిట్టల ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. కళాకారుల బృందాలు పలు రకాల భజనలు, కోలాటలతో భక్తులను అలరింపజేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

ఏనుగుమల్లమ్మకు ప్రత్యేక అలంకరణ

మల్లయ్యకొండకు వెళ్లే మార్గంమధ్యలో వెలసిన శ్రీ ఏనుగుమల్లమ్మ ఆలయంలో అమ్మవారికి పూజారులు విజయకుమారి, శేఖర్ ప్రత్యేక అలంకరణ చేశారు. పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. మహిళా భక్తులు అమ్మవారికి పూజలతో మొక్కులు తీర్చుకున్నారు.

సామాన్యుడిపై టీడీపీ నాయకుల దౌర్జన్యం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి బంధువుల స్థల వివాదం
- అధికార బలంతో అడ్డంగా దూసుకొచ్చిన టీడీపీ శ్రేణులు
- జిల్లా ఎస్పీకి బాధితుడి ఫిర్యాదు


నాటిన జామ మొక్కలను పీకేసిన దృశ్యం


నరసింహరాజుపై దాడికి యత్నిస్తున్న టీడీపీ వర్గీయులు

సుండుపల్లె : అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షుడు, రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్మోహన్‌రాజు బంధువుల స్థల వివాదం.. నరసింహరాజుపై దౌర్జన్యం చేసేలా జరిగింది. ఒక పక్క అధికార బలం.. మరో పక్క పదవిలో ఉన్న టీడీపీ నేత కావడంతో.. ఆయన అనుచరులు అడ్డంగా దూసుకొచ్చారు. సామాన్యుడిగా ఉన్న నరసింహరాజు కుటుంబీకులపై వాదోపవాదాలు చేస్తూ దౌర్జన్యంగా తోసేశారు. ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక సొంత భూమిని కాపాడుకోవాలన్న తపనతో ప్రయత్నం చేసిన అతని పైకి వస్తుండటంతో.. తీవ్ర స్థాయిలో తోపులాట జరిగింది. వివరాలలోకి వెళ్లితే.. సుండుపల్లె మండల పరిధిలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ రాచపల్లికి చెందిన నరసింహరాజు ఒక పత్రిక పెట్టుకుని హైదరాబాదులో జీవనం సాగిస్తున్నారు. బాధితుని కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నరసింహరాజు 6 నెలల క్రితం తన స్వగ్రామంలో కొండూరు విజయభాస్కర్‌రాజు దగ్గర ఒక ఎకరా భూమిని కొనుగోలు చేశాడు. అధికార తెలుగుదేశం పార్టీ నాయకులకు ఆయన ఎకరా భూమిపై కన్నుపడింది. ఆ స్థలం తమకు కావాలని అడిగారని, తాను ఇవ్వనని చెప్పానని బాధితుడు మీడియాకు తెలిపారు. రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు అత్తవారి స్థలం ఇదని, నువ్వు ఎలా కొంటావని నరసింహరాజును జగన్‌మోహన్‌రాజు అనుచరులైన మండల టీడీపీ నాయకులు శివరాంనాయుడు మరో 15 మందిని వెంటబెట్టుకొని వెళ్లి వారిపై దాడికి పాల్పడ్డాడు. నరసింహరాజు తన పొలంలో నాటుకున్న జామ చెట్లను దౌర్జన్యంగా పీకేశారు. స్వతహాగా పత్రికా వ్యక్తి అయిన నరసింహరాజు వీడియోలు, ఫొటోలు తీసేందుకు ప్రయత్నిస్తే అతని ఫోన్‌ని లాక్కున్నారు. సర్వే నంబర్ 47 సబ్ డివిజన్ చేసి 457/1, 2,3 మూడు భాగాలుగా విభజన జరిగింది. 457/1లో ఏ, బీ, సీలుగా సబ్ డివిజన్ అయింది. అందులో పాస్‌బుక్‌లో పేర్కొన్న ప్రకారం వన్‌బీలో ఉన్న ఎకరా స్థలం తనదేనని నరసింహరాజు అంటున్నాడు.

జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు

టీడీపీ రాజంపేట ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు అత్తగారి భూమి భాగాలలో.. అదే గ్రామానికి చెందిన నరసింహరాజు ఒక ఎకరా భూమి తగాదా విషయమై బాధితుడు అయిన నరసింహరాజు జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లికి ఫిర్యాదు చేశారు. 6 నెలల క్రితం కొన్న భూమిలో తాను జామచెట్లను నాటుతుండగా మండల టీడీపీ నాయకుడు శివరాంనాయుడు మరికొంత మందిని వెంటబెట్టుకొని తనపై, తన కుటుంబ సభ్యులపై దౌర్జన్యానికి దిగి తమకు తోసేశారని పేర్కొన్నాడు. వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని నరసింహరాజు తన వారితో కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఎస్పీ కార్యాలయం దగ్గర పత్రికా విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి తనకు న్యాయం చేయాలని కోరాడు. 'మాకు బలం లేదు.. టీడీపీ అధికారంలో ఉండటంతో ఆ పార్టీ నేతలు మాపై దౌర్జన్యం చేస్తున్నారు. ఎస్పీనే మాకు న్యాయం చేయాలి' అని వేడుకున్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం


మాట్లాడుతున్న అశోక్‌బాబు

నందలూరు : ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.అశోక్‌బాబు అన్నారు. సోమవారం నందలూరుకు చేరుకున్న రాజ్యాంగ పరిరక్షణ యాత్రకు దళిత నాయకులు స్వాగతం పలికారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిపల్లి సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో అశోక్‌బాబును ఘనంగా సత్కరించారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ద్వారా మాలలు అన్ని విధాలుగా నష్టపోతారన్నారు. కొందరి మాయమాటల మోజులో పడి కేంద్ర ప్రభుత్వం వర్గీకరణ చేయడం అన్యాయం అన్నారు. దేశంలో రాజ్యాంగాన్ని పరిరక్షించడం కోసమే ఈ యాత్ర చేపట్టామన్నారు. మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగం సంజీవ్ మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ యాత్రకు అనూహ్య స్పందన వస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో మోడపోతుల రాము, ఆర్ముగం విశ్వనాథ్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు పెనుబాల నాగసుబ్బయ్య, కాకి చంద్ర, నాయనపల్లి ఆదినారాయణ, తుమ్మది శివకుమార్, గుడిష సుబ్రమణ్యం, ఎముక దుర్గయ్య, శివనరసింహులు, సురేష్, నాగభూషణం, నాగరాజు, డిస్కో మని తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో మహిళ మృతి

వీరపునాయునిపల్లె : మండలంలోని యు.వెంకటాపురం గ్రామానికి చెందిన సువర్ణ (28) పాము కాటుకు గురై సోమవారం మృతి చెందింది. ఆమెకు 4 సంవత్సరాలలోపు పిల్లలు ముగ్గురు ఉన్నారు. వివరాలలోకి వెళితే.. శనివారం సాయంత్రం పశువుల మేత కోసం పొలం వద్దకు వెళ్లి పొలం గట్టున గడ్డి కోస్తుండగా.. ఆమె చేతికి ఏదో కరచినట్లు అనిపించింది. బాధితురాలిని వెంటనే కుటుంబ సభ్యులు ప్రొద్దుటూరు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పాము కాటుకు గురయినట్లు వైద్యులు తెలిపారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో కర్నూలుకు తీసుకెళ్లాలని వైద్యులు తెలపడంతో తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి బ్యాచ్

ముగ్గురిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ సీఐ

గాలివీడు : పట్టణంలో గుట్టుగా సాగుతున్న గంజాయి బ్యాచ్‌పై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. లక్కిరెడ్డిపల్లె ఎక్సైజ్ సీఐ కిషోర్ కుమార్ తన సిబ్బందితో కలసి సోమవారం ఉదయం గాలివీడు పట్టణంలో ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఇదే విషయమై సీఐని వివరణ కోరగా గత కొన్ని రోజులుగా రెక్కీ నిర్వహించిన అనంతరం పక్కా సమాచారంతో చిలకలూరిపేట వద్ద గుడిసెల్లో నివాసం వుంటూ గంజాయిని విక్రయిస్తున్నట్లు గుర్తించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని ఫోన్ ద్వారా గంజాయి క్రయవిక్రయాలు సాగిస్తున్న మరో ఇద్దరు యువకులు గుర్తించినట్లు తెలిపారు. అనంతరం ముగ్గురిని అదుపులోకి తీసుకుని లక్కిరెడ్డిపల్లెకు తరలించి విచారణ చేస్తున్నట్లు తెలిపారు. అయితే గాలివీడులో గంజాయి మత్తులో యువత పెడదారి పడుతున్న విషయంపై గతంలో తల్లిదండ్రులు ఆరోపించినా, పత్రికల్లో కథనాలు వెలువడినా స్థానిక యంత్రాంగం పెడచెవిన పెట్టడంతో పరిస్థితి తీవ్ర రూపం దాల్చిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి గంజాయి మూలాలను సమూలంగా కూకటివేళ్లతో పెకలించి వేసేలా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

'క్వారీ కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నాం'


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామ ప్రజలు

ఓబులవారిపల్లె : మంగంపేట జాతీయ రహదారి పక్కనే కంకరకు సంబంధించిన మైన్‌లో నిర్వహిస్తున్న బ్లాస్టింగ్ కారణంగా చాల రోజుల నుంచి ఇబ్బందులు పడుతున్నామని, పరిష్కరించాలని గోవిందంపల్లె గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ యామినిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోవిందంపల్లె గ్రామస్తులు మాట్లాడుతూ చాల సంవత్సరాలుగా గ్రామానికి సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా కంకర క్వారీలో పెద్ద ఎత్తున పనులు నిర్వహిస్తుండటంతో.. మైన్‌లో భారీ పేలుళ్ల వల్ల వెలువడుతున్న కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అనేక మంది రోగాల బారిన పడుతున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా క్వారీలో పనులు నిర్వహిస్తున్నరని, కాలుష్య నివారణ కోసం ఎటువంటి చర్యలు తీసుకోక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అంతే కాకుండా జాతీయ రహదారి పక్కనే పెద్ద ఎత్తున బ్లాస్టింగ్ నిర్వహిస్తున్నారని, దీంతో భయాందోళనకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మండలంలోని రైతులు ఆన్‌లైన్‌కు సంబంధించి భూముల సమస్యలపై తహసీల్దార్‌కు అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సిద్దేశ్వర్‌రావు, ఆర్ఐ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్షన్ అప్‌గ్రేడ్ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్

కడప కోటిరెడ్డిసర్కిల్ : దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రైల్వే ట్రాక్షన్ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. రైల్వే చట్టంలోని 1989లోని సెక్షన్ 2 (37ఎ) ప్రకారం విద్యుత్ ట్రాక్షన్ సిస్టమ్ అప్‌గ్రేడేషన్ పనులను ప్రత్యేక రైల్వే ప్రాజెక్టుగా ప్రకటిస్తూ కేంద్రం అధికారిక నోటిఫికేషన్ ఈ నెల 24వ తేదీన జారీ అయినట్లు ప్రాజెక్టు అధికారి అమిత్ అగర్వాల్ తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద దేశ వ్యాప్తంగా 3000 మెట్రిక్ టన్నుల లోడింగ్ లక్ష్యాన్ని సాధించాలన్న దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కడప జిల్లాలో ముద్దనూరు– కడప మధ్య భూసేకరణ చేపట్టనున్నారు. ఈ భూసేకరణ ప్రజాప్రయోజనం కోసం, జాతీయ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా జరుగుతుందని ప్రాజెక్టు అధికారి తెలిపారు.

దోపిడీ దొంగ అరెస్ట్

- 9 తులాల బంగారం స్వాధీనం
- ఏఎస్పీ మనోజ్‌రామ్‌నాథ్‌హెగ్డే



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ మనోజ్‌రామ్‌నాథ్‌హెగ్డే


రాజంపేట రూరల్ : ఏరుకాల్వ రమాదేవి అనే మహిళపై దాడి చేసి బంగారం దోచుకెళ్లిన వేముల విశ్వనాథంను అరెస్టు చేసినట్లు ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే తెలియజేశారు. మండల పరిధిలోని ఎర్రబల్లిలో గల డీఎస్పీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి ఏఎస్పీ వివరాలు వెల్లడించారు. ఈ నెల 10వ తేదీన పుల్లంపేట మండలం వత్తలూరు వడ్డిపల్లి గ్రామానికి చెందిన రమాదేవిపై పీలేరు మండలం బోడుమల్లువారిపల్లి గ్రామం మొరవడ్డిపల్లికి చెందిన వేముల విశ్వనాథం దాడి చేసి బంగారం దోచుకెళ్లారని తెలియజేశారు. విశ్వనాథంను రూరల్ సీఐ బీవీ రమణ ఆధ్వర్యంలో పుల్లంపేట, పెనగలూరు ఎస్ఐలు బీవీ శివకుమార్, బీ రవిప్రకాశ్‌రెడ్డి రెడ్డిపల్లి చెరువు కట్టవద్ద తమ సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నట్లు తెలియజేశారు. అతని వద్ద నుంచి 92,030 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ బంగారం విలువ దాదాపు రూ.9,50000లు ఉంటుందన్నారు. విశ్వనాథం నేరానికి ఉపయోగించిన రక్తపు మరకలు కలిగిన రాయిని సీజ్ చేశామన్నారు. అదే విధంగా ఒక పల్సర్ బైక్, ఓపీపీఓ సెల్‌ఫోన్‌ను సీజ్ చేశామని తెలియజేశారు. అయితే ఈ బంగారు ఆభరణాలు చిత్తూరు జిల్లాలోని సదుం, అన్నమయ్య జిల్లాలోని పుల్లంపేట, పెనగలూరు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో నమోదు అయిన కేసులలోని బంగారంగా గుర్తించినట్లు పేర్కొన్నారు.

విలేకరితోపాటు ముగ్గురిపై కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం : కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించిన ఘటనలో ఓ విలేకరితోపాటు ముగ్గురు యువకులపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 27న ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దని చెప్పినందుకు కానిస్టేబుల్‌ను నలుగురు యువకులు తోశారు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు ఆ నలుగురిపై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు. వారిలో ఓ విలేకరి కూడా ఉండటం గమనార్హం.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్రిష్ణప్రసాద్


గాయపడిన వెటర్నరీ ఉద్యోగి నాగేంద్రప్రసాద్

మదనపల్లె రూరల్ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు గాయపడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ములకలచెరువు మండలం చౌడసముద్రంకు చెందిన రమణ(60) తనకు పరిచయస్తుడైన మదనపల్లె మండలం పోతబోలుకు చెందిన నరసింహులుతో కలిసి చౌడసముద్రం నుంచి పాపిరెడ్డిపల్లెకు బయలుదేరారు. మార్గమధ్యంలోని చెట్లవారిపల్లె వద్ద ట్రాక్టర్ పక్క నుంచి ఉన్నట్లుండి రోడ్డుపైకి రావడంతో ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో రమణ తీవ్రంగా గాయపడగా, స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

■ నిమ్మనపల్లె మండలం ఎగువమాచిరెడ్డిగారిపల్లెకు చెందిన ఫిరోజ్, అతడి భార్య రాజమ్మ(45) ఇద్దరూ కలిసి ద్విచక్రవాహనంలో సోమలకు వెళుతుండగా, మార్గమధ్యంలోని కందూరు సమీపంలో మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో రాజమ్మ తీవ్రంగా గాయపడింది. స్థానికులు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

■ కడప జిల్లా ఖాజీపేటకు చెందిన శంకరనాయక్ (24), కామాక్షయ్య(35) అరటికాయలు అన్‌లోడ్ చేసేందుకు కూలీ పనుల్లో భాగంగా పులివెందుల నుంచి బొలేరో వాహనంలో పలమనేరుకు బయలుదేరారు. మార్గమధ్యంలోని కురబలకోట మండలం ముదివేడు సమీపంలో బొలేరో ముందు చక్రం పంక్చర్ కావడంతో వాహనం అదుపుతప్పింది. దీంతో పైన ఉన్న ఇద్దరు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆయా ఘటనలపై సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

జింక అడ్డు రావడంతో..

మదనపల్లె రూరల్ : రోడ్డు ప్రమాదంలో వెటర్నరీ ఉద్యోగి తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం ములకలచెరువు మండలంలో జరిగింది. కందుకూరు వెటర్నరీ కేంద్రంలో ఎల్ఎస్ఏగా పని చేస్తున్న నాగేంద్రప్రసాద్(47) సోమవారం సమావేశం నిమిత్తం కందుకూరు నుంచి బురకాయలకోటకు వెళుతుండగా, మార్గమధ్యంలోని దూలంవారిపల్లె సమీపంలో రోడ్డుకు అడ్డంగా జింక రావడంతో బైక్ అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో కాలు విరిగింది. గమనించిన స్థానికులు వెంటనే బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

డిప్యూటీ ఎండీవోకు..

పెద్దతిప్పసముద్రం : మండలంలోని బూర్లపల్లి సచివాలయంలో పని చేసే డిప్యూటీ ఎండీవో క్రిష్ణప్రసాద్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ నెల 27న ఆయన విధులు ముగించుకుని తన ద్విచక్ర వాహనంలో సత్యసాయి జిల్లా పెనుగొండకు వెళుతుండగా సోమందేపల్లి వద్ద కారు ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో కర్నూల్ ఆసుపత్రిలోని అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్నట్లు మండల పరిషత్ సిబ్బంది సోమవారం తెలిపారు. విషయం తెలుసుకున్న బూర్లపల్లి సర్పంచ్ సుబ్బిరెడ్డి కర్నూల్‌లోని అదే ఆసుపత్రిలో ట్రైనీ డాక్టర్‌గా పని చేస్తున్న తన బావమరిదికి ఫోన్ చేసి అధికారి క్రిష్ణప్రసాద్ ఆరోగ్యం కుదుట పడేందుకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు.